ప్రాణాలు పోతున్నా పట్టదా?

ఈ చిత్రంలోని హృదయ విదారక దృశ్యం గత నెలలో యల్లనూరు మండలంలో చోటుచేసుకుంది. మే 7న పార్నపల్లి డ్యాం నుంచి పులివెందులకు నీటిని సరఫరా చేసే పులివెందుల బ్రాంచ్ కెనాల్ (పీబీసీ)లో దుస్తులు శుభ్రం చేసుకునేందుకు కల్లూరుకు చెందిన వృద్ధురాలు నాగలక్ష్మమ్మ (65) వెళ్లారు. ఆమె వెంట మనవరాలు బ్రేసియా(10), మనవడు జాషువా(8) కూడా వెళ్లారు. చిన్నారులిద్దరూ ఈత కొట్టేందుకు కాలువలోకి దిగారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కొట్టుకుపోయారు. నాగలక్ష్మమ్మ కేకలు వేస్తూ వారిని రక్షించేందుకు నీటిలోకి దిగుతుండగా కాలుజారి పడిపోయి ఆమె కూడా కొట్టుకుపోయారు. కొద్దిదూరంలో వీరి మృతదేహాలు లభ్యమయ్యాయి. ఒకే కుటుంబంలో ముగ్గురు మృత్యువాత పడటంతో అప్పట్లో సంచలనం కలిగించింది.


మృతి చెందిన నాగలక్ష్మమ్మ, చిన్నారులు (ఫైల్)

- పీబీసీ కెనాల్‌లో పడి ఏటా పలువురి మృత్యువాత
- నిద్రావస్థలో అధికారులు

యల్లనూరు: పార్నపల్లి డ్యాం నుంచి దిగువ భాగాన ఉన్న పులివెందుల బ్రాంచి కెనాల్‌కు నీరు పారుతుంటుంది. ఈ నీటి ప్రవాహంలో పడి ఏటా ఇద్దరో...ముగ్గురో కొట్టుకుపోతున్నారు. అభం శుభం తెలియని చిన్నారులు ఈత కోసం పీబీసీ కాలువ వద్ద నీటిలో దిగి ఆ ప్రవాహానికి ఊపిరాడక ప్రాణాలను కోల్పోతున్నారు. కల్లూరు, శింగవరం, వెంకటాంపల్లి గ్రామ సమీపంలో పీబీసీ కెనాల్ కాలువ పులివెందులకు వెళ్తుంది. కాలువలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో దుస్తులను శుభ్రం చేసుకునేందుకు వెళ్లేవారు కాలు జారి నీటిలో కొట్టుకుపోతున్నారు. గత నెల 11న ఇద్దరు చిన్నారులు జాషువా, బ్రేసియాతో పసాటు నానమ్మ నాగలక్ష్మమ్మ మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. అలాగే వెంకటాంపల్లి సమీపాన ఏడాది కిందట దుస్తులు శుభ్రం చేస్తుండగా.. కాలు జారి నీటిలో పడిపోయి ఇద్దరు మహిళలు ఊపిరాడక మృత్యువాత పడ్డారు. రెండేళ్ల కిందట శింగవరం గ్రామ సమీపంలోని కెనాల్ వద్ద ఒక బాలుడు కాలువలో పడి చనిపోయాడు. ఏటా ఇద్దరు లేక ముగ్గురు చనిపోతున్నా పీబీసీ అధికారుల్లో చలనం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

చోద్యం చూస్తున్న అధికారులు

పులివెందుల బ్రాంచి కెనాల్ కాలువ ఉధృతంగా ప్రవహిస్తుంటే ...అధికారులు నిద్రావస్థలో జోగుతున్నారు. పీబీసీ అధికారులు కాలువ కెనాల్ వెంబడి కంచె ఏర్పాటు చేస్తే ప్రమాదాలు నివారించవచ్చని కల్లూరు, శింగవరం, వెంకటాంపల్లి గ్రామాల ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


ప్రమాదకరంగా పీబీసీ కాలువ

కంచె ఏర్పాటు చేయాలి



మా గ్రామానికి సమీపంలో పీబీసీ కెనాల్ ఉంది. చిన్నారులు ఈతకు వెళ్లి కెనాల్‌లో దూకుతున్నారు. నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో బయటకు రాలేక కొట్టుకుపోతున్నారు. ఏటా ఇద్దరు లేక ముగ్గురు మృత్యువాత పడుతున్నారు. అధికారులు కెనాల్ చుట్టూ కంచె ఏర్పాటు చేస్తే ప్రజలకు ఇబ్బందులు ఉండవు. - శ్రీనివాసులు, కల్లూరు

పిల్లలకు కాపలా ఉంటున్నాం



మా గ్రామం వద్ద పీబీసీ కెనాల్ ఉంది. దీంతో పిల్లలు అటువైపు వెళ్లకుండా తల్లిదండ్రులు కాపలా ఉంటున్నాం. రెండేళ్ల కిందట ఓ బాలుడు నీటిలో మునిగి చనిపోయాడు. ఇంత మంది కెనాల్‌లో పడి మృత్యువాత పడుతున్నా ఎవ్వరికీ పట్టడం లేదు. అధికారులు చర్యలు తీసుకుని కంచె ఏర్పాటు చేయాలి.

- జమాల్, సర్పంచు శింగవరం

క్లుప్తంగా

ఖైదీలు సత్ప్రవర్తన కలిగిఉండాలి


గుత్తి జైలును తనిఖీ చేస్తున్న జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ రాజశేఖర్

గుత్తి: ఖైదీలందరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ ఎస్. రాజశేఖర్ సూచించారు. పట్టణంలోని సబ్ జైలును ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన జైలులోని బ్యారెక్‌లు, బాత్ రూమ్‌లు, స్టోర్ రూమ్, వంట గదులు పరిశీలించారు. అనంతరం ఆయన ఖైదీలతో మాట్లాడారు. జైల్లో సదుపాయాలు ఎలా ఉన్నాయని ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఖైదీలందరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. జైలు నుంచి బయటకు వెళ్లాక గొడవలు జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో జైలు అధికారి మహేశ్వరుడు, కోర్టు సిబ్బంది సాదిక్ వలి, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

గుత్తి రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పుణ్యవతి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఫిర్యాదుల కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు. ఫిర్యాదు పత్రాల్లో ప్రజలు తప్పకుండా ఆధార్, సెల్‌ఫోన్ నంబర్లను నమోదు చేయాలన్నారు.

అధైర్య పడకండి.. అండగా ఉంటాం


కల్లూరులో ఆంజనేయులు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఆలూరి సాంబశివారెడ్డి

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సంధ్యారాణి మామ వైఎస్సార్ సీపీ నాయకుడు లక్ష్మీనారాయణ తండ్రి ఆంజనేయులు (84) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఎన్ఆర్ఐ వింగ్ కో ఆర్డినేటర్ ఆలూరి సాంబశివారెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆర్థిక సాయం అందజేసి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మండల మాజీ కన్వీనర్ నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులను అరికట్టాలి


మాట్లాడుతున్న మోహన్‌నాయక్

పామిడి: పట్టణంలోని ప్రైవేట్ స్కూళ్లలో అధిక ఫీజుల వసూళ్లను అరికట్టాలని హరిత దివ్యాంగుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు బీ మోహన్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం పామిడిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు అధిక ఫీజుల వసూళ్లతో పాటు పుస్తకాలు, యూనిఫామ్ పేర నర్సరీ నుంచి పదో తరగతి వరకూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఇది పేద, సామాన్య విద్యార్థుల తల్లిదండ్రులకు పెనుభారంగా మారిందన్నారు. విద్యాశాఖాధికారులు తక్షణం స్పందించి అధికఫీజులను నియంత్రించాలన్నారు. లేనిపక్షాన విద్యార్థులను సంఘటితం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మణికంఠ, చంద్రశేఖర్, రామాంజనేయులు, అంజి, భాస్కర్ యాదవ్, రాజశేఖర్, గోపి, మనోజ్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి


రిలేదీక్షల్లో పాల్గొన్న కార్మికులు

గుంతకల్లుటౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మిక జేఏసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, మల్లేష్, సహాయ కార్యదర్శి సురేంద్ర డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలేదీక్షలు 8వ రోజుకు చేరుకున్నాయి. అత్యున్నత న్యాయస్థానం తీర్పు మేరకు కార్మికులకు నెలకు రూ.29,200 వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని వారు కోరారు. దీక్షల్లో కార్మిక నాయకులు లక్ష్మీనారాయణ, మస్తాన్, సుంకన్న, సతీష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' అవినీతిపై కేంద్రం విచారణ చేయాలి


మాట్లాడుతున్న పంచాయతీ రాజ్ వింగ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సీవీ రంగారెడ్డి

గుత్తి: రాష్ట్రంలో ఉపాధి హామీ పథకంలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయి. వెంటనే కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని విచారణ చేపట్టాలని వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ వింగ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సీవీ రంగారెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు తిక్కస్వామి డిమాండ్ చేశారు. గుత్తిలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో ఆదివారం వారు పార్టీ నాయకులతో కలిసి ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. సర్పంచులు , ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీల గౌరవ వేతనం పెంచాలన్నారు. సర్పంచులకు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఫైనాన్స్ నిధులను వెంటనే గ్రామ పంచాయతీల అకౌంట్లలో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనులు గ్రామ పంచాయతీల ద్వారానే చేయించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ పథకం పక్కదారి పట్టిందన్నారు. టీడీపీ నాయకుల జేబులు నింపడానికి ఉపాధి పథకం పనికి వస్తోందన్నారు. అన్ని అంశాలను సోమవారం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి గురుప్రసాద్ యాదవ్, పబ్లిసిటీ పట్టణ అధ్యక్షుడు వెల్డింగ్ రవూఫ్, ప్రధాన కార్యదర్శి బ్రహ్మకుమార్, ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు మల్లికార్జున, పంచాయతీ రాజ్ వింగ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రవి కుమార్, విజయ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సు. దీర్, మురళి, క్రాంతి, నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయండి



గుంతకల్లులో మాట్లాడుతున్న రాజేష్ గౌడ్


గార్లదిన్నెలో పోస్టర్లు విడుదల చేస్తున్న సీఐటీయు నాయకులు

గుంతకల్లు/గార్లదిన్నె: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 9న చేపట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ కోరారు. ఆదివారం గుంతకల్లులోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరసగా మూడు సార్లు అధికారం చేపట్టిన ఎన్‌డీఏ కార్మిక హక్కులను పూర్తిగా హరించిందన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలన్నారు. కనీస వేతన కింద కార్మికులకు నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, 12వ వేతన సంఘం ఏర్పాటు చేయాలని, ప్రైవేటీకరణ విధానాలు నిలుపుదల చేసి ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాలన్నారు. సుప్రీమ్ కోర్టు సూచన మేరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని తదితర డిమాండ్‌లతో జూలై 9న చేయబోయే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మహేష్, నాయకులు సురేష్, ఈశ్వరయ్య, చితంబరి, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఈనెల 9న సమ్మె విజయవంతం చేయాలంటూ గార్లదిన్నెలో పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటనారాయణ, ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఆటో యూనియన్, పంచాయతీ వర్కర్లు, హమాలి యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' పథకాలు అమలు చేయాలి



ర్యాలీ చేస్తున్న సీపీఐ నాయకులు

యాడికి: సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, యాడికి కాలువకు వీకే ఆదినారాయణ రెడ్డి పేరు పెట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండు చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని వెంగమనాయుడు కాలనీలో సీపీఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో ఆ పార్టీ 9వ మహాసభ నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా జాఫర్‌తోపాటు సీపీఐ సీనియర్ నాయకుడు, వేములపాడు మాజీ సర్పంచు వీకే ప్రదీప్ రెడ్డి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, తాడిపత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నప్ప యాదవ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పెద్దవడుగూరు కార్యదర్శి వెంకటరాముడు యాదవ్ హాజరయ్యారు. జాఫర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. యాడికి కాలువకు, రాయలచెరువు చెరువుకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేయాలన్నారు. యాడికి కాలువకు వీకే ఆదినారాయణ రెడ్డి పేరు పెట్టాలని వీకే ప్రదీప్‌రెడ్డి కోరారు. పేద విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంటుకుని యాడికిలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని సీపీఐ మండల కార్యదర్శులు మహమ్మద్ రఫీ, వెంకటరాముడు యాదవ్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జూటూర్ బ్రదర్స్ రజాక్, బసీర్ అహమ్మద్, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పొలాల్లో కేబుల్ చోరీ


దర్మాపురంలో కేబుల్ కట్ చేసిన దుండగులు

పెద్దపప్పూరు: మండలంలోని దర్మాపురం, షేక్‌పల్లి, చిక్కేపల్లిలో గుర్తు తెలియని దుండగులు దాదాపు 15 మంది రైతుల పొలాల్లోని మోటార్ల వద్ద కేబుల్‌ను శనివారం రాత్రి చోరీ చేశారు. ప్రతి నెలా ఏదో ఒకచోట కేబుల్ చోరీ చేస్తున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నా రికవరీ చేయడం లేదన్నారు. ఇదే విషయమై సోమవారం జిల్లా పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత రైతులు తెలిపారు. జిల్లా అధికారులు స్పందించి భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా తగు చర్యలు చేపట్టాలని రైతులు కోరారు.

గూగూడు కుళ్లాయిస్వామికి వెండిహారం వితరణ


వెండిహారం అందజేస్తున్న గోపీనాథ్

నార్పల: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన గూగూడు కుళ్లాయిస్వామికి జిల్లా కేంద్రానికి చెందిన పుల్లా గోపీనాథ్‌యాదవ్ 2.5 కేజీల వెండి హారాన్ని ఆదివారం ఈఓ శోభ, ప్రధాన అర్చకుడు హుసేనప్పకు అందించారు. ఈ సందర్భంగా దాత పేరున ఆలయంలో పూజలు నిర్వహించారు.

బావమరిదిపై బావ దాడి

పామిడి: పట్టణంలోని నాగిరెడ్డి కాలనీకి చెందిన బావమరిది నరసింహపై బావ రాజ్‌కుమార్ కట్టెతో దాడి చేశాడు. తాగిన మైకంలో నెలకొన్న ఘర్షణలో రాజ్‌కుమార్ కట్టెతో కొట్టడంతో నరసింహ తల పగిలింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి మోసాలను ఇంటింటికీ తీసుకెళ్లండి


వైవీఆర్, మైనార్టీ కమిటీ నాయకులను సన్మానిస్తున్న ముస్లిం యువకులు

గుంతకల్లుటౌన్: కూటమి ప్రభుత్వ మోసాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన ఎంఎం.రెహమాన్ ఆధ్వర్యంలో కమిటీ నాయకులు, ముస్లిం నేతలు తదితరులు వైవీఆర్, నైరుతిరెడ్డిని శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. మైనార్టీ విభాగపు నూతన కమిటీ సభ్యులందరినీ వైవీఆర్ అభినందించారు. కార్యక్రమంలో పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఎంఎం.రెహమాన్, ఉపాధ్యక్షులు ఏఎండీ.మైనుద్దీన్, దాదాఖలందర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఖలీల్, నాయకులు మౌలా, బాసిద్, ఎంఎం.బాషా, షేక్షావలి, తల్వార్, మహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్: సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు ఆశగా చూపి అధికారం చేజిక్కించుకున్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వ తీరును ఎండగట్టాలని మాజీ ఎమ్మెల్యే వైవీఆర్ పార్టీ శ్రేణులకు సూచించారు. ఆదివారం యువజన విభాగం అధ్యక్షుడు శాంతు నాయుడు, ఉపాధ్యక్షుడు బాలు, ప్రధాన కార్యదర్శి గోవిందు ఇతర సభ్యుల ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే వైవీఆర్‌తోపాటు, జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డిని సత్కరించారు.

సర్పంచులకు 'తల్లికి వందనం' వర్తింపజేయాలి


మాట్లాడుతున్న యోగేశ్వరరెడ్డి

తాడిపత్రిటౌన్: సర్పంచులకు తల్లికి వందన పథకం వర్తింపజేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, తాడిపత్రి నియోజకవర్గ పంచాయతీ విభాగం అధ్యక్షుడు యోగేశ్వరెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సర్పంచులలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులున్నారని, వారికి గౌరవ వేతనం కింద రూ.3 వేలు ఇస్తున్నారని, వారిని తల్లికి వందనం పథకానికి అనర్హులను చేయడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం 15 ఫైనాన్స్ కింద రూ.1150 కోట్ల నిధులను విడుదల చేస్తే..ఆ గ్రాంట్‌ను కూటమి ప్రభుత్వం పక్కదారి పట్టించిందన్నారు. కూటమి ప్రభుత్వ విధివిధానాలు నచ్చక పంచాయతీ కార్యదర్శులు రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నారన్నారు. అలాగే గ్రామ పంచాయతీల్లో చెత్తను శుభ్రం చేసే కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రామచంద్రారెడ్డి, రమేష్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, రఘువేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'బెతస్థ క్రిస్టియన్' వార్షికోత్సవం


ప్రసంగిస్తున్న వక్తలు

గుంతకల్లు: స్థానిక సిద్ధార్థ నగర్‌లోని బెతస్థ క్రిస్టియన్ బ్రదరన్ అసెంబ్లీ ఆధ్వర్యంలో 11వ వార్షికోత్సవ ఉజ్జీవ కూడిక కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఏసు ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో బ్రదర్ రవికుమార్, సురేష్, బైబిల్ కాలేజ్ ప్రిన్సిపాల్ పీటర్, కృష్ణసాయి తదితరులు పాల్గొన్నారు.

చర్చీల్లో ఆరాధనోత్సవం

పామిడి: మండలంలోని అన్ని చర్చీల్లో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చీలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ ప్రసంగించారు. క్రీస్తుకు మహిమకరంగా జీవించినప్పుడే పరలోక భాగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: పట్టణంలోని పాండురంగ స్వామి ఆలయంలో ఆదివారం శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఆ కుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. సంఘం అధ్యక్షుడు అంజి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి తహసీల్దార్ రమాదేవి, మండల విద్యాశాఖాధికారి సుబ్బరాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పది, ఇంటర్‌లో ప్రతిభ కనరబరచిన విద్యార్థులు షర్మిల, పుష్ప, లక్ష్మీదేవి, రమ్యను అభినందించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నీట్ ర్యాంకర్‌కు సత్కారం


హరితను సత్కరిస్తున్న దృశ్యం

పామిడి: మండలంలోని కట్టకిందపల్లికి చెందిన రామాంజనేయులు, రమాదేవి దంపతుల కుమార్తె, నీట్ ర్యాంకర్ హరితను ఆదివారం యాదవ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఇటీవల మెడిసిన్‌కు సంబంధించి నీట్‌లో 547 మార్కులతో జాతీయస్థాయిలో 13,067 ర్యాంకు సాధించిన ఆమెను అభినందిస్తూ సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగభూషణం, రాము, రామాంజనేయులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

గుత్తి: స్థానిక ఎంఎస్ హైస్కూల్‌లో 1974–75వ సంవత్సరంలో కలసి చదువుకున్న వారు అదే పాఠశాల వేదికగా ఆదివారం కలుసుకున్నారు. 50 ఏళ్ల తర్వాత కలుసుకున్న వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఏడుపదుల వయస్సుకు చేరువలో ఉన్న వారందరూ ఎంతో ఉత్సాహంగా సందడి చేశారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు నాగరంగ ప్రసాద్ రాయల్, మల్లికార్జున, తదితరులు నేతృత్వం వహించారు.

రేపు వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

గుంతకల్లుటౌన్: స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఉన్న పీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సమావేశానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేంపల్లె సతీష్‌రెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంట్ పరిశీలకుడు నరేష్‌కుమార్ రెడ్డి హాజరవుతారన్నారు. పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం


పీర్ల పెట్టెను ఊరేగిస్తున్న గ్రామస్తులు

శింగనమల: శింగనమలలో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 27 నుంచి చావిడిలోని పీర్ల పెట్టెలను కిందకు దించి, రోజుకొక పీర్ల పెట్టెను ఊరేగిస్తున్నారు. మొదట వెండి పీర్ల పెట్టెను గ్రామంలో ఊరేగించారు. జూలై 4న శింగనమల, గోవిందరాయునిపేటలోని పీర్లను ఊరెగింపు చేస్తారు. 5న శింగనమల, గోవిందరాయునిపేట, గురుగుంట్ల, చిన్నజలాలపురం గ్రామాలకు చెందిన పీర్లను ఊరేగిస్తారు. 6న విడిది దినంగా నిర్వహిస్తారు.7న జలధి కార్యక్రమం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. మొహర్రం సందర్భంగా ఘర్షణలకు పాల్పబడితే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

ఇద్దరు మహిళలకు గాయాలు


పల్టీకొట్టిన ఆటో

గుంతకల్లు రూరల్: మండలంలోని బుగ్గ సంగమేశ్వర ఆలయం ఎదుట ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్నూలు జిల్లా, మద్దికెర గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు గాయపడ్డారు. మద్దికెర గ్రామానికి చెందిన అంకాలమ్మ, లక్ష్మి ఆటోలో ఊరూరా తిరిగి కూరగాయలు విక్రయిస్తూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఆటోలో కూరగాయలు వేసుకొని గుంతకల్లుకు బయలుదేరారు. మార్గమధ్యంలో బుగ్గ సంగమేశ్వర ఆలయ ఆర్చ్ వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. దీంతో ఆటో పల్టీ కొట్టింది. గాయపడిన మహిళలను గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.